

చంద్రబాబు రూట్ మ్యాప్ పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 16న పెద్దాపురం నియోజకవర్గంలో జరిగే పర్యటన రూట్ మ్యాప్‌ను మంగళవారం ఇన్చార్జి డిఎస్‌పి సుంకర మురళీమోహన్, ఆర్‌డిఒ జె సీతారామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పర్యటన జరిగే ప్రాంతాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట పెద్దాపురం సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ సురేష్ తదితరులు ఉన్నారు.


రూట్ పరిశీలిస్తున్న డి.ఎస్.పి, ఆర్‌డిఒలు

ఆగని అక్రమ తవ్వకాలు..!

- యథేచ్ఛగా బొండు ఇసుక రవాణా- నిబంధనలు ఉల్లంఘిస్తున్న అక్రమార్కులు నాయకుల అండతో దందా - అధికారుల తీరుపై అనుమానాలు


ఫోటో: బొండు ఇసుక తరలిస్తున్న లారీ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా తీర ప్రాంత మండలాల్లో బొండు ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని పొన్నాడ పంచాయతీ పరిధిలోని రావి వారిపొడు, కోనపాప పేట గ్రామాల సమీపంలో సముద్ర తీరం వెంబడి బొండు ఇసుక మట్టి అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అవినీతి రహిత ప్రభుత్వమని చెప్పుకొస్తున్న వైసీపీ ప్రజా ప్రతినిధులు బొండు ఇసుక అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదంటూ పలువురి నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● రాత్రి పూటా రవాణా

గత కొన్నేళ్లుగా యు.కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంతంలో అక్రమ తవ్వకాలు యథావిధిగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ భారీ స్థాయిలో జరిగిన తవ్వకాల ద్వారా రూ. కోట్లలో సొమ్ములను వెనుకేసుకున్నట్లు గతంలో అనేక ఆరోపణలు వినిపించాయి. అయితే లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్న సందర్భంలో ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో స్థానికుల నుంచి కొన్ని ఫిర్యాదులు అందడంతో గతంలో తాత్కాలికంగా తవ్వకాలను నిలుపుదల చేసినా మళ్లీ... ఫిర్యాదులు రాకుండా ఉండేందుకు బొండు ఇసుకను సాయంత్రం నుండి మొదలు పెట్టి రాత్రి వేళల్లో తెల్లవార్లూ లారీల్లో తరలించడం ప్రారంభించారు.

● కాసుల పంట

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇక్కడ అక్రమ దందా నిలుపుదల కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికార పార్టీ అండదండలతో ఇదంతా సాగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే రవాణా సాగిస్తున్న వారి వెనుక కొందరు రాజకీయ నేతలు వుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొండు ఇసుక అక్రమ రవాణా ద్వారా నిర్వాహకులు రోజూ రూ.లక్షల్లో సొమ్ములను ఈ వ్యాపారం ద్వారా వసూలు చేస్తున్నారు. కొంత అధికారులకు, మరికొంత స్థానిక నేతలు పంచుకుంటు న్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక మండల ప్రజాప్రతినిధి భర్త ఆధ్వర్యంలోనే ఇసుక రవాణా సాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పట్టని అధికారులు

తీర రక్షణకు తూట్లు పొడుస్తూ సాగుతున్న అక్రమ తవ్వకాలపై నిఘా ఉంచాల్సిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ తీర ప్రాంతాలకు చెందిన పలువురు మత్స్యకార పెద్దలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక అధికారులకు తెలిసే తవ్వకాలు జరుపుతున్నారా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుపుతున్నా కొన్ని సందర్భాల్లో ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టజెప్పుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు ఈ అక్రమ రవాణా సాగిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేయడం పరిపాటిగా మారింది.

ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు

మండలంలో బొండు ఇసుక తవ్వకాలకు తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఒకవేళ అక్రమంగా ఎవరైనా తవ్వకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.గతంలో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో నిరంతరం తవ్వకాలపై నిఘా ఉంచాం.


ప్రసాద్, తహశీల్దార్, యు. కొత్తపల్లి

రేపటి నుంచి నామినేషన్లు

-ఉమ్మడి జిల్లాలో 1,436 ఎంఎల్‌సి ఓటర్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థలు ఎంఎల్‌సి స్థానానికి జరగనున్న ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమైంది. ఈనెల 16 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు కాకినాడ కలక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. మంగళ, బుధ వారాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న 1,436 ఓటర్లలో 1,084 మంది ఎంపిటిసి సభ్యులు, 59 మంది జడ్‌పి టిసి సభ్యులు, 266 మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు కావడంతో కాకినాడ, రాజమహేంద్ర వరం సిటీల ఎంఎల్‌ఎలు మినహా 17మంది మిగిలిన నియోజకవర్గాల ఎంఎల్‌ఎలు, ముగ్గురు ఎంపీలు, ఐదుగురు ఎంఎల్‌సిలు పోలింగ్‌లో పాల్గొనున్నారు. నామినేషన్ పత్రాలను జెసి చాంబర్ వద్ద అందుబాటులో ఉంచారు. అక్కడే నామినేషన్లను స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి ఎన్నికల నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణను నియమించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 2015లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డి సుబ్రహ్మణ్యం, 2017లో చిక్కాల రామచంద్రరావు, 2021లో అనంత బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసారి కూడా అధికార పార్టీకి చెందిన అభ్యర్థికే ఓటర్లు పట్టం కట్టే అవకాశం ఉంది. అయితే ఎన్నికలు జరుగుతాయా లేక ఏకగ్రీవం అవుతుందా అనేది వేచి చూడాలి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.వి.నాగేశ్వరరావు

24న ధర్నాలు, ప్రదర్శనలు

కేంద్ర బడ్జెట్, అదానీ అవినీతికి వ్యతిరేకంగా నిరసన : సిపిఎం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై అదనపు భారాలు వేసినందుకు, అదానీ అవినీతికి నిరసనగా ఈ నెల 24వ తేదీన జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సిపిఎం జిల్లా విస్తత సమావేశం మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో దువ్వ శేష బాబ్జీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లా డుతూ మోడీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించింద న్నారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిందని విమర్శించారు. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి భారీ కోతలు విధించారనీ విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను ఎత్తివేశారని, బడ్జెట్‌లో సంక్షేమ నిధులు తగ్గిపోయాయని, ప్రజాపంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారని ఆయన తెలిపారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనంపై భారాలు మోపేదిగా ఈ బడ్జెట్ ఉందన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వ కుండా, విభజన హామీలు అమలు చేయలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపలేద న్నారు. అదానీ కుంభకోణం అంతర్జాతీ యంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందన్నారు. చిన్న మదుపు దార్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్‌ఐసిని ముంచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకతి వనరుల్ని అదానీపరం చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ నెల 24వ తేదీన జిల్లా, మండల కేంద్రాలలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాల న్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ జిల్లా కార్యకలాపాల నివేదికను ప్రవేశపెడుతూ భవిష్యత్ కర్తవ్యాలను గూర్చి వివరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు జి.బేబీరాణి, కరణం ప్రసాదరావు, సిపిఎం శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వాహనాలపై నుంచి రహదారిపై జారిపడిన నల్ల రాతి బండలు

లారీ నుంచి రోడ్డుపై పడ్డ రాళ్లు

- గిడజాంలో గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామంలో ఎస్ పైడిపాల. గుమ్మరేగుల. ఉప్పుము పాలెం. చిన్న మల్లాపురం. ములగపూడి.మల్లంపేట గ్రామాల నుంచి లారీలపై రవాణా సాగుతున్న నల్ల బండ రాళ్ల తరలింపులో జాగ్రత్తలు పాటించకపోవడంతో రహదారిపై జారి పడుతున్నాయి. దీనివలన గ్రామస్తులు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంటున్నారు మంగళవారం గిడజం గ్రామంలో వాహనం పైనుంచి రహదారిపై బండరాళ్లు జారి పడటంతో గ్రామస్తులు నిరసన తెలిపారు. మైనింగ్, రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే క్వారీ యజమానులు నిబంధనలు గాలికి వదిలేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం దీనిపై మైనింగ్, రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

బైజూస్ యాప్ వినియోగంపై సంతృప్తి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన టాబ్ లలో విద్యార్థులు బైజూస్ వినియోగిస్తున్న యాప్‌పై పిఠాపురం డివైఇఒ డి.సుభద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండల విద్యాశాఖ అధికారి బి.అబ్బాయితో కలిసి మండలంలోని పెద్దనాపల్లి లింగంపర్తి ఏలేశ్వరం ఉన్నతపాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని, బైజూస్ యాప్ వినియోగం, మధ్యాహ్న భోజన నిర్వహణ, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఆమె వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎం.భాస్య, పి.వెంకటేశ్వరరావు, వెన్న శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ,. విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.


యాప్ వినియోగిస్తున్న తీరు పరిశీలిస్తున్న డివైఇఒ

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కోటనందూరు

పాత కొట్టం జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోటనందూరు ఎస్‌ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల బారి నుండి రక్షణ, ట్రాఫిక్ రూల్స్‌ని ఏ విధంగా పాటించాలని, మాదక ద్రవ్యాలు వినియోగంపైన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న సామూహిక ఎలుకల నివారణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని రైతులందరూ ఈ నెల 16న చేపట్టనున్న సామూహిక ఎలుకల నివారణకు సహకరించాలని వ్యవసాయ అధికారిణి బి జ్యోతి పిలుపునిచ్చారు. అవసరమైన బ్రోమో డయోలోన్ ఎలుకల నివారణ మందును రైతు భరోసా కేంద్రాల వద్ద పొందాలన్నారు.

నేడు ఆదిత్యలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలో ఆదిత్య విద్యా ప్రాంగణంలో నేడు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. ఈ మెగా రక్తదాన శిబిరం ఉదయం 9-30 ని.లకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి లక్ష్మీరాజ్యం ప్రారంభిస్తారని తెలిపారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొని అత్యధిక యూనిట్ల రక్తం ఇచ్చి, సమష్టిగా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సతీష్ రెడ్డి కోరారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు

- హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2023 చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించిన కలెక్టర్ కతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించే నిమిత్తం జిల్లాలో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2023 చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కాకినాడ దేవాలయం వీధి శ్రీ పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ కృతిక లాంఛనంగా ప్రారంభించారు. చేనేత, జౌళి శాఖ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత కార్మికులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి వస్త్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ ఎక్సపో-2023 చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు ఈ వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయన్నారు. రాయలసీమ మొదలుకొని ఉత్తర కోస్తా వరకు 14 జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన మంగళగిరి, చీరాల, శ్రీకాళహస్తి కళాంకారి ఇతర రకరకాల చేనేత వస్త్రాలతో 30 స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వచ్చే నెలలో చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించే నిమిత్తం ఉప్పాడ, పెద్దాపురం, కోనసీమ కాటన్ వస్త్రాలు అమ్మకాలు పెంచే విధంగా 14 రోజులు పాటు వస్త్ర ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భారత ప్రభుత్వం జిల్లాలో తాడిపత్రి, ప్రత్తిపాడు, ఉప్పాడలో మూడు చేనేత క్లస్టర్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ముందుగా కాకినాడలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చేనేత, జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు తెలిపారు. ఈ ప్రదర్శనలో కేవలం ఉత్పత్తిదారులకు మాత్రమే స్టాల్స్ కేటాయించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ రాజమహేంద్రవరం డీడీ బి.ధనుంజయ్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించాలి

వయో వృద్ధుల చట్టంపై విస్తత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన వయో వృద్ధుల చట్టం-2007పై ప్రత్యేక అవగాహన సదస్సుకు కలెక్టర్ కృతిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం 2007లో ఏర్పాటైన వయోవద్ధులు చట్టంపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. వయోవృద్ధుల సమస్యలు, పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ -14567 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. 60 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఈ నెంబర్‌ను ఉపయోగించుకోవచ్చని, హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ వయోవృద్ధుల సమస్యలపై సరైన మార్గనిర్దేశం చేస్తుందని కలెక్టరు తెలిపారు. జిల్లాలో మరిన్ని సీనియర్ సిటిజన్స్, రెసిడెన్స్ సిటిజన్స్ అసోసియేషన్ల ఏర్పాటుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ కృతిక సూచించారు. అనంతరం హెల్ప్ ఏజ్ ఇండియా రూపొందించిన ఎల్డర్ లైన్ జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్‌ను విడుదల చేశారు. హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధులు పీపీటీ ద్వారా అధికారులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావం తులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, కాకినాడ కమిషనర్ కె.రమేష్, ఆర్‌డిఒ బీవీ రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతా దేవి, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రెసిడెంట్ వెంపర్ల నారాయణ మూర్తి, కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రెసిడెంట్ బుద్ధరాజు సత్యనారాయణ రాజు, సభ్యులు రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ఎల్డర్ లైన్ ప్రతినిధి పుష్పాంజలి, హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి మృణాల్, అధికారులు హాజరైయ్యారు.

పారదర్శకంగా భూ రక్ష సర్వే

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీసర్వే కి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి రెవెన్యూ సిబ్బందితో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ బివి రమణ. మాట్లాడుతూ కాకినాడ రెవిన్యూ డివిజన్‌లో 121 రెవెన్యూ గ్రామాలలో రీసర్వే పూర్తయిన నేపథ్యంలో రికార్డుల స్వచ్ఛీకరణ పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు సంబంధించి తహశీల్దార్ స్థాయి నుండి గ్రామ రెవెన్యూ అధికారి వరకు శిక్షణ ఇస్తున్నందున రీ సర్వే రికార్డుల రూప కల్పన కు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి జీ వరహాలయ్య. డివిజనల్ టెక్నికల్ మేనేజర్. దుర్గాప్రసాద్. తహశీల్దార్‌లు, డిప్యూటీ తహశీల్దార్లు. గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణలో భాగస్వాములు కావాలి

- డీఎంహెచ్‌ఓ శాంతి ప్రభ

ప్రజాశక్తి - కాకినాడ

డాక్టర్ అనగా బోధకుడు అని అర్థం అనీ, ప్రతి వైద్యుడూ ఆరోగ్యసంరక్షణకు గాను అవకాశం ఉన్న అన్ని సందర్భాలలోనూ ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.శాంతి ప్రభ అన్నారు. నగరానికి చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణులు డాక్టర్ యనమదల మురళీ కృష్ణ మంగళవారం కాకినాడ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం వైయస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా డయాబెటిస్, బిపి వంటి దీర్ఘవ్యాధులకు చికిత్సలను, పరీక్షలను విస్తతంగా అందుబాటులోకి తెచ్చిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కోవిడ్ పీడ కాలంలో సాంఘిక మాధ్యమాల ద్వారా, రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు ఆ జబ్బు గురించి ఎప్పటికప్పుడు అవగాహన, భరోసా కల్పించిన డాక్టర్ యనమదల మురళీకష్ణ కషిని డిఎంహెచ్‌ఓ కొనియాడారు. డాక్టర్ మురళీకష్ణ ప్రభుత్వ ఉద్యోగి కాకున్నా, గతంలోనే అనేక సార్లు ప్రభుత్వ వైద్యులకు నిర్వహించిన సాంక్రమిక వ్యాధుల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న విషయం అభినందనీయమని డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. డాక్టర్ యనమదల మురళీకృష్ణ తాను రాసిన కోవిడ్ ఎయిడ్స్ నేను పుస్తకాన్ని డాక్టర్ శాంతి ప్రభకు అందజేశారు.


కోవిడ్ ఎయిడ్స్ నేను పుస్తకాన్ని డాక్టర్ శాంతి ప్రభకు అందజేస్తున్న డాక్టర్ మురళీ కృష్ణ


గోదావరి కాల్వలో పేరుకున్న కలుషిత జలాలను చూపుతున్న నూతలపాటి అప్పలకొండ

కలుషిత జలాల్లో శివరాత్రి స్నానాలా?

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలు నలుమూలల నుండి శ్రీ చాళుక్య కుమార రామ భీమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున హాజరు కానుండగా, యాత్రికులు స్నానమాచరించే ఆలయ పుష్కర జలాలు, గోదావరి జలాలు అధ్వానంగా ఉన్నాయని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి జలాల్లో స్నానం ఆచరిస్తే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ధవళేశ్వరం నుంచి సామర్లకోట వరకు ఉన్న ఈ గోదావరి కాలువలో ఎగువ ప్రాంతాల నుండి వ్యర్థ కాలుష్య జలాలు కలుస్తుండడం వల్ల దుర్గంధ పూరి తంగా తయారయ్యా యన్నారు. శివరాత్రి సమీ పిస్తున్న కాలువలో జలాలను శుభ్రం చేసే ప్రక్రియ అధికారులు ఇప్పటివరకు చేపట్టక పోవడం విచారకమన్నారు. ఇటువంటి జలాల్లో భక్తులు స్నానమాచరించి రోగాలు బారిన పడితే అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ డి నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా భక్తులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు జలాలను మార్చే ప్రక్రియ కూడా రేపటి నుంచి చేపడుతు న్నామన్నారు.

కార్టూ'నిజం'



తేడా ఏం వుందయ్యా..? అవే అప్పులు... అవే రుణాలు... అవే కేటాయింపులు... అనవసరంగా గోల చేస్తారెందుకు..?

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పెద్దాపురం

నాయి బ్రాహ్మణులకు చేదోడు పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించి నందుకు నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యలో నాయి బ్రాహ్మణ కాలనీలో మంగళ వారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొమ్మన అమ్మన్న,తమిరి శ్రీనివాస్,రాకుర్తి పుల్లయ్య, బైలపూడి సూరిబాబు, పసుపులేటి నాగబాబు పాల్గొన్నారు.

తోటపేటలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ ఇంచార్జ్ దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధూళిపూడి వెంకట రమణ, మందాల గంగ సూర్య నారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్ బాబు, భైరవమూర్తి, పొన్నమండ రామలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సైకిల్ తొక్కడం వల్ల వచ్చే వ్యాయామంతో క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యానికి పొందడం వీలవుతుందని జిల్లాలో పలు కేంద్రాల్లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సిల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సామర్లకోట రూరల్ మండలం వేట్లపాలెం పిహెచ్‌సీ నుండి ర్యాలీని ఎంపిపి సత్తిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు డాక్టర్ హేమ, డాక్టర్ ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం కాండ్రకోట పిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాల్లో పిహెచ్‌సి డాక్టర్లు సిహెచ్ ధనలక్ష్మి, ఉషా ప్రియదర్శినిల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. కాండ్రకోటలో ఈ ర్యాలీని జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, రాయ భూపాలపట్నంలో ఎంపిపి పెంకే సత్యవతిలు ప్రారంభించారు. కార్యక్రమంలో కాండ్రకోట సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, ఆర్‌బి పట్నం సర్పంచ్ అడ్డాల మరియమ్మ, ఎంపీటీసీ కాదా నాగలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** వైసిపి నాయకులు వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో నాగులపల్లి గ్రామం నుండి సైకిళ్లతో నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి. ఎంపీటీసీ చింతపల్లి లక్ష్మీ గోపాల్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** ఉన్నత పాఠశాల నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ ని నిర్వహించారు. ర్యాలీని గాడి మొగ పిహెచ్‌సి. హెల్త్ ఎడ్యుకేటర్ సీతా మహాలక్ష్మి ప్రారంభించారు. ఎం.ఎల్.హెచ్. వి.లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సామర్లకోటలో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు ఆరోగ్య శాఖ సిబ్బంది


తాళ్లరేవుల్లో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు ఆరోగ్య శాఖ సిబ్బంది.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో యువకుని మృతి

ప్రజాశక్తి - కాజులూరు

దుగ్గుదురు శివారు రాచబంద పంట పొలాల మధ్య కె. గంగవరం మండలం పేకేరుకు చెందిన కాటే కళ్యాణ్ (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపారు. మృతుడు కళ్యాణ్ హైదరాబాదులో ప్రైవేట్ సంస్థలోఉద్యోగం చేస్తూ గత నెల రోజుల క్రితం పేకేరు వచ్చినట్లు తెలిపారు. సంఘటన స్థలంలో పోలీసులు, డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం బృందం వివరాలు సేకరించారు. సంఘటన స్థలాన్ని కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాస్ గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్, క్లూస్ టీం ఎస్ఐ ప్రశాంతి, ఆర్ఐ అజయ్ పరిశీలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక గ్రామ శివారులో పేకాడుతున్న ఎనిమిది మందిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలివి.. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఇందులో ఎనిమిది మంది పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.34,570 నగదును స్వాధీన పరచుకొన్నామన్నారు. అలాగే వారిపై కేసు నమోదు చేశామన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల వివరాలు ప్రకారం కపిలేశ్వరం మండలం అంగర గ్రామానికి చెందిన రాగం నాగేశ్వరరావు నిడదవోలు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లేందుకు ఈనెల 5వ తేదీన ఉదయం ఇంటి వద్ద నుంచి తన భార్య రమ్యతో మోటార్ సైకిల్ పై బయలుదేరాడు మండలంలోని మెర్లపాలెం గ్రామం సమీపంలో ఆర్ అండ్ బి రహ దారిపై వెనుక నుంచి కారు డీ కొట్టడంతో నాగేశ్వరావు గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిహెచ్ సుధాకర్ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి- గోపాలపురం

వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వేళ్లచింతలగూడెంకు చెందిన అనూషకు ఏలూరు జిల్లా దెందులూరు మండలం పోతులూరుకు చెందిన పెట్టా ఉదయకుమార్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలంగా వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల కాలంలో అదనంగా కట్నం తీసుకురమ్మని భర్త ఉదయ్ కుమార్ వేధింపులకు దిగాడు. అతనికి అనూష అత్త మనోరమ, ఆడపడుచు స్రవంతి వంతపాడారు. దీంతో అనూష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి పై కొడవలి తో దాడి

ప్రజాశక్తి-ఐ.పోలవరం

జి.వేమవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చినకొడప గ్రామాని కి చెంది న బడుగు గణేష్ పై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయ పర్చాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గణేష్ ఇంటి నుంచి వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న తమ సొంత పొలం వద్దకు వెళ్లే సరికి పెనుమాల జగన్నాథం అనే వ్యక్తి కొడవలితో గడ్డి కోస్తున్నాడు. మా పొలంలో గడ్డి ఎందుకు కోస్తున్నావు, మాకు గేదెలు ఉన్నాయి అని గణేష్ అడిగాడు. దీంతో ఆగ్రహించిన జగన్నాధం చేతిలో ఉన్న కొడవలితో గణేష్ పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన గణేష్ ను మోటారు సైకిల్ పై టి.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఐ.పోలవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు గ్రూపుల మధ్య తగాదాలు

ప్రజాశక్తి - ఆలమూరు

అమ్మవారి జాతరలో రెండు గ్రూపుల మధ్య ఏర్పడిన వివాదం దాడులకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ఈనెల 11న మడికి శివారు నాగులపేటలో జరిగిన దుర్గమ్మ జాతర సందర్భంగా రెండు గ్రూపులు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఇది చినికిచినికి గాలివానగా మారింది. అయితే సోమవారం రాత్రి మడికి చెందిన ఒక గ్రూపు నాగులపేట గ్రామంలోకి ప్రవేశించి కర్రలతో దాడులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఆలమూరు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. మంగళవారం నాగులపేట గ్రామస్తులు ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి దాడులకు పాల్పడిన వారిని అరెస్ట్ చేసి తమకు రక్షణ కల్పించాలని కోరారు. దాడులు చేసిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

చూడు గేదెను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - గోపాలపురం

రోడ్డు దాటుతున్న చూడు గేదెను లారీ ఢీ కొట్టిన సంఘటన స్థానిక జాతీయ రహదారిలో జరిగింది. పెద్దగూడేనికి చెందిన దిర్సిపోము దుర్గారావు చూడు గేదెను లారీ ఢీకొంది. ప్రమాదానికి గురైన గేదెకు పశువైద్యాధికారి డాక్టర్ ధరణిబాబు వైద్యం అందించారు. గేదె రూ.50వేలు ఉంటుందని రైతుల తెలిపారు. గేదె పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.

వృక్ష సంపద నాశనం చేయడంపై ఆందోళన

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ పరిధిలో నేషనల్ హైవే భూమిలో వృక్ష సంపదను నాశనం చేశారని పలువురు గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేసి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఇక్కడ ఎంతో వృక్ష సంపద ఉండేదని వాటిని పలువురు వ్యక్తులు నాశనం చేయడం బాధాకరమన్నారు. ఇందుకు పాల్పడిన వారిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి కృష్ణారెడ్డి, తాడి వెంకటరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, కొవ్వూరి సీతారామరెడ్డి, వీరి గోపి, చెల్లె ప్రేమ్ కుమార్, భావన శివ, గంటా మనోహర్ దాను పాల్గొన్నారు.

డ్రెయిన్లపై క్రాస్‌బండ్‌ల ఏర్పాటు

- కాల్వల నుంచి మోటార్లతో లిఫ్టింగ్, వీడ్ తొలగింపు కోసం..
101 పనులు చేపట్టేందుకు 742.81 లక్షల మంజూరు
- రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

అందుబాటులో ఉన్న జల వనరుల సమగ్ర వినియోగం ద్వారా కాకినాడ జిల్లాలో సాగులో ఉన్న రబీ పంటలకు నీటి ఎద్దడి లేకుండా కాపాడేందుకు గోదావరి డెల్టా తూర్పు డివిజన్, కాకినాడ డ్రైనేజ్ డివిజన్, ఏలేరు డివిజన్ల పరిధిలోని డ్రెయిన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు, కాల్వల నుండి మోటార్లతో లిఫ్టింగ్, వీడ్ తొలగించడానికి 742.81 లక్షల నిధులతో 101 పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు గోదావరి తూర్పు డివిజన్ పరిధిలో మొత్తం 43 పనులకు 338.23 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలియజేసారు. ఇందులో భాగంగా కొంగోడు, పెద్దాపుర పాడు, యండమూరు, రాఘురు, జగన్నాథ్ కపూర్, భీమన క్క, కరప బోడి, సంపర బోడి, కేవంత కోట్, గుళ్లదుర్రు, ఉప్పుమిల్లి, కాజులూరు, జగన్నాధగిరి, వెల్ల సౌత్, కోలంక, దంగేరు, తొస్సిపూడి, బిక్కవోలు ఛానళ్ల నుండి మోటార్ల నుండి లిఫ్ట్ చేసేందుకు నిధులు మంజూరు అయినట్టు తెలిపారు.

పెద్దాపురం ఏలేరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 18 పనులకు గాను 68.58 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో భాగంగా పిఠాపురం-1, గొల్లప్రోలు, లొద్దులపాటి కాల్వ, గొర్రిఖండి, పాటికాల్వ, వీర్రాజు కాల్వ, ఉబండ డ్రెయిన్, ఉప్పుటాంకు స్లూయిస్, ఆర్.ఆర్.బి టాంక్ ఆఫ్ టేక్ స్లూయిజు, పిబిసి పరిధిలోని పాత ఏటి కాల్వ, వాలుగు కాల్వలలో తూటు, గుర్రపు డెక్క వీడ్ తొలగింపు, గుమ్మిడిగడ్డ, నడిమేరు రెగ్యులేటర్, పాటి కాల్వ, వెల్ల ఏలేరు డ్రెయిన్, నాగులపల్లి కోలంక, తమ్మవరం శివారు కోలంక, ఆర్.ఆర్.బి. సర్ ప్లస్ వియర్-1,2, ఉప్పుటాంకు వియర్, నక్కలఖండి డ్రెయిన్ లపై క్రాస్ బండ్ల ఏర్పాటు, పిబిసి మెయిన్ కెనాల్ రైట్ సైడ్ గట్టు పటిష్టీకరణ, గొల్లప్రోలు వద్ద నక్కలఖండి డ్రెయిన్ గండి పూడిక నిమిత్తం ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

కాకినాడ డ్రైనేజి డివిజన్ పరిధిలో మొత్తం 40 పనులకు 336 లక్షల నిధులు మంజూరు జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా వెస్ట్ ఏలేరు మేజర్ డ్రెయిన్, కైకవోలు, గాడేరు, తూటేరు, భావారం,మామిడికట్ల, పెదపూడి సెక్షన్-2, ఆనపాలమ్మ మీడియం డ్రెయిన్, చెంబాడ మైనర్, రెల్లూవాడ మైనర్, పోడేవరం మీడియం, తాడిపల్లి మీడియం, పాతర్లగడ్డ మీడియం, తూరంగి మైనర్, నడకుదురు మైనర్, పెనుగు దురు మైనర్, సహపురం మీడియం, కరప మైనర్, కాంద్రంగుల మైనర్, చినమామిడాడ మీడియం, చింతపల్లి మైనర్, టిబి మైనర్, రాజు మీడియం, యండమూరు మీడియం, వెంకటేశ్వర్లు మైనర్ తదితర 40 డ్రయిన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు పనులు మంజూరై య్యాన్నారు. ఈ పనుల న్నిటినీ సత్వరం చేపట్టి రైతుల రబీ పంట లకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

అడ్డు కట్టలతో సాగునీటి ఎద్దడి నివారణ

ప్రజాశక్తి - కాజులూరు



పెనుమళ్ళ డ్రైయిన్‌కు వేసిన అడ్డుకట్టలను పరిశీలిస్తున్న అధికారులు

సాగు నీటి ఎద్దడి నివారణకు అడ్డు కట్టలు వేయడం ద్వారా సాగునీటి ఎద్దడి నివారణ సాధ్యమవుతుందని డ్రైనేజ్ డివిజనల్ ఇంజనీర్ ఆర్.నాగేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెనుమళ్ళలో గల డ్రెయినేజ్ కు వేసిన అడ్డుకట్టలు పరిశీలించారు. ప్రస్తుతం రైతులకు సాగునీటి ఎద్దడి ఉందని దీనిని నివారించేందుకు డ్రెయిన్లలో అడ్డుకట్టలు వేయడం ద్వారా అంద్రంగి పెనుమళ్ళ తనుమల్లు అయితపూడి తిప్పరాజు పాలెం కాజులూరు దుగ్గుదుర్రు గ్రామాలకు చెందిన సుమారు 1000 ఎకరాలకు సాగునీటి ఎద్దడి నుండి నివారణ కలుగుతుందన్నారు. మండలంలోని నీటి ఎద్దడి ఎక్కడ ఉన్న ఆ డ్రెయిఇనేజీలకు అడ్డుకట్టలు వేయిస్తామన్నారు.. దీనికి సంబంధించిన నివేదికలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరమణ, సర్పంచ్ పెద్దిరెడ్డి చంద్రావు స్థానిక రైతు పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ ఇంజనీర్ హిమ రత్న , డ్రెయిన్స్ జెఇలు రాజారెడ్డి హేమలత క్వాలిటీ కంట్రోల్ జె.ఈ.లు సుష్మ, అనిల్ కుమార్, విజయలక్ష్మి పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

పవరలో ఎంఇఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పవర ఎంపిపి. జిల్లా పరిషత్ పాఠశాలలను మంగళ వారం ఎంఇఒ వై శివరామకృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీలు చేసి పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్స్ కరెక్షన్స్ టీచర్ లెసన్ ప్లాన్లు, టీచర్ డైరీలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీ లించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థులు, టీచర్ల వినియోగంపై హెచ్‌ఎం ఉమా మహేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ఉపాధ్యా యులతో నిర్వహించిన సమావేశంలో పదవ తరగతి విద్యార్థులకు బోధనపై సూచనలు తెలియజేశారు.

ఆహారం నాణ్యతపై అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలోని హుస్సైన్ పురం గ్రామములో అంగన్‌వాడీ పాఠశాల -3లో ఆహార నాణ్యత సరిగా లేదని వచ్చిన ఫిర్యాదులపై మంగళ వారం సామర్లకోట ఎంపిడిఒ డి శ్రీలలిత హుస్సేన్‌పురం గ్రామం అంగన్‌వాడీ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్ కుసుమ కుమారి, అంగన్వాడి టీచర్ కనకదుర్గ, ఆయా సత్యవతి, ప్రీ స్కూల్‌కు వచ్చిన 12 మంది 3 నుండి 6 ఏళ్ల వయస్సు మధ్యలో గల బాలబాలికలను, గర్భిణులు, బాలింతలను ఆహార నాణ్యతపై విచారించి నివేదికను పై అధికారులకు సమర్పించినట్లు చెప్పారు. తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి, పి.వి.ఎస్.రామనాద్, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతే ముఖ్యం

టూరిస్టు పోలీస్ స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాకినాడ జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు, అధికారులు

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రంలో ప్రజలు ఎక్కువ సందర్శించుకునే ఇరవై పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ స్టేషన్ల మంగళవారం ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అందులో భాగంగా స్థానిక కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం(పాదగయ) వద్ద నిర్మించిన టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ను కూడా ప్రారంభించారు. ఈ వర్చువల్ ప్రారంభోత్సవంలో కాకినాడ జిల్లా ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబుతోపాటు ఇతర పోలీసు ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ పర్యాటకుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిదన్నారు. శక్తిపీఠం, పాదగయ క్షేత్ర దర్శనానికి దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు వారి భద్రత, తదితర పోలీసు సేవలు అందుబాటులో ఉండే విధంగా ఈ టూరిస్టు పోలీస్ స్టేషన్లను రూపొందించినట్టు తెలిపారు. ఈ టూరిస్ట్ పోలీస్ ఔట్ పోస్టులు స్థానిక పోలీస్ స్టేషన్లకు అనుసంధానమై పుణ్యక్షేత్రం సందర్శించే పర్యాటకుల నుండి వచ్చే ఫిర్యాదులకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ వాహన సదుపాయం, మహిళా సిబ్బందితోపాటు ఆరుగురు పోలీసు సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉండేలా నియమించామన్నారు.

.రాష్ట్రంలో పర్యాటకాభివద్ధి పుంజుకుంటోందని, కరోనా కాల విరామం తర్వాత టూరిస్ట్ స్పాట్లకు పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడం పండుగ, పర్వదినాలు, సెలవురోజుల్లో ఈ తాకిడి మరింతగా పెరిగినందున టూరిస్టుల భద్రతకై ఒక తపన, ఆలోచనతో తెచ్చిన ఈ కియోస్కులు పోలీసు శాఖలో గొప్ప సంస్కరణకు నాంది పలికి ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని ఎస్పి తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని బ్రోచర్ల రూపంలో అందుబాటులో ఈ కియోస్కుల వద్ద వుంచుతున్నట్టు తెలిపారు. స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు కృషి చేసిన సిఐ, ఎస్ఐలను, దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకర్‌ను, ఔట్ పోస్ట్ స్టేషన్ సిబ్బందిని ఎస్పి శాలువాలతో సత్కరించారు . కార్యక్రమంలో ఎఎస్పి పి.శ్రీనివాస్, డి ఎస్పిలు ఎం అంబికా ప్రసాద్, పి.మురళీకృష్ణారెడ్డి, పిఠాపురం సర్కిల్ ఎన్స్పెక్టర్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ సంతోష్, పిఠాపురం సర్కిల్ ఎస్ఐలు,. పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు ఉన్నారు.



సభలో పాల్గొన్న ప్రిన్సిపల్ నరేందర్, డైరెక్టర్ పావని తదితరులు

ఘనంగా 'ప్రియ' 10వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రియా హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ టి.నరేందర్ ప్రారంభించారు. శ్రీ రామకృష్ణ మిషన్ పరిసర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులతో కలిసి చేపట్టారు. అనంతరం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ టి.పావని మాటాడారు. తమ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి పదేళ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయ మన్నారు. 2013 ఫిబ్రవరి 14న 36 మంది విద్యార్థులతో ఈ సంస్థను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం వేయి మంది విద్యార్థులతో సంస్థ నడుస్తుందన్నారు. తమ వద్ద శిక్షణ పూర్తి చేసుకున్న 200 మందికి పైగా విద్యార్థులు మాల్దీవులు, యూరప్, దుబాయ్, సౌదీ, బెహరాన్ వంటి దేశాల్లో స్థిరపడ్డారన్నారు. సుమారు 800 మందికి పైగా విద్యార్థులు దేశంలో వివిధ ప్రాంతాల్లోని తాజ్, జిపి, ఒబెరాయ్, నోవాటల్, లెమన్ ట్రీ వంటి స్టార్ హోటళ్లలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా క్రూజ్ లైన్స్ మల్టీ నేషనల్ కంపెనీల్లోనూ చాలా మంది స్థిరపడ్డారన్నారు. ప్రతి అడుగులో తమకు సహకరిస్తూ విజయాలకు కారణమైన మేనేజ్‌మెంట్ సిబ్బందికి, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

అగ్నిప్రమాదంలో పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి - జగ్గంపేట

మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో పూరి గుడిసె దగ్ధమైంది. జగ్గంపేట మండలంలోని జై.కొత్తూరు గ్రామానికి చెందిన గుర్రాల వెంకటరమణ కాపురం ఉంటున్న తాటాకుళ్ళు గ్యాస్ లీక్ అయ్యి అగ్నిప్రమాదకి గురైనట్టు జగ్గంపేట ఫైర్ అధికారి లక్ష్మణరావు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.80 వేల మేర నష్టం వాటిల్లినట్టు ఆయన తెలిపారు. తహశీల్దార్ బి.శ్రీదేవి స్థానిక సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధితులకు తక్షణసాయంగా 25 కేజీల బియ్యాన్ని అందజేస్తూ సంబంధిత ఉన్నతాధికారులకు ఆమె సమాచారం అందించినట్లు తెలిపారు. ప్రమాదస్థలాన్ని సర్పంచ్ నకిరేడ్డి నాగేశ్వరరావు, ఎంపిటిసి మడగల అప్పారావు అనే పెద్దకాపు, నరిసే కష్ణార్జున, రెవెన్యూ అధికారి నరసింహారావు, సచివాలయ కార్యదర్శి దేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పరిశీలించారు.

త్వరలో కోటిపల్లి -నర్సాపురం రైల్వే లైన్ కోసం పోరాటం

ప్రజాశక్తి - పిఠాపురం

కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ కోసం త్వరలో పోరాటం చేస్తామని టిడిపి పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులు, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ జిఎంసి హరీష్ అన్నారు. మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కడియం ఎంపిపి వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్‌తో కలిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వర్మ మాట్లాడుతూ చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా 16న బారీగా నియోజకవర్గం నుండి పెద్దాపురంలో జరగబోయే ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం, సైకిల్ రావాలి-సైకో పోవాలి నినాదంతో ర్యాలీగా వెళ్ళి ఘన స్వాగతం పలుకుతమన్నారు.

అనంతరం జిఎంసి హరీష్ మాట్లాడుతూ. జిల్లా లో చంద్రబాబు పర్యటన పూర్తి అయ్యి తిరిగి వెళ్ళే వరకూ ఆయనతో కలిసి నడుస్తామని తెలిపారు. కోటిపల్లి నుండి నరసాపురం రైల్వే లైన్‌ను తన తండ్రి మాజీ ఎంపీ, మాజీ లోక్ సభ స్పీకర్ బాలయోగి ప్రారంభించారన్నారు బాలయోగి మరణించిన తరువాత మిగతా రాజకీయ పార్టీలు ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్లలేక పోయాయన్నారు. రాష్ట్రం విడిపోయిన అనంతరం చంద్రబాబు అధికారం చేపట్టి వెంటనే రైల్వే లైన్ నిమిత్తం 183 కోట్లు మంజూరు చేసి జీవో విడుదల చేస్తే జగన్ రెడ్డి రాగానే వాటిని రద్దు చేసి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కేంద్రం ఇవ్వవలసిన నిధులు వాటా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కాలయేపన చేస్తుందని విమర్శించారు.త్వరలో కోటిపల్లి నుండి నరసాపురం రైల్వే లైన్ విషయమై పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రెండు మున్సిపాలిటీలు,మూడు మండలాలు పార్టీ అధ్యక్షులు , టిడిపి దళిత నాయకులు, కౌన్సిలర్ లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలే టిడిపిని గెలిపిస్తాయి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం వైఫల్యాలే టిడిపిని గెలిపిస్తాయని మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 15 16 17 తేదీలలో జరిగే చంద్రబాబు జిల్లా పర్యటన విజయవంతంపై ప్రతిపాడులో నియోజకవర్గ ఇన్చార్జ్ పరుపుల రాజా అధ్యక్షుడు జరిగిన కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి యనమల కృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు. .

జల్లు స్నాన ఘట్టానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -మండపేట

కేశవరంలోని మాడేచెరువు గట్టు వద్ద ఉన్న ఎస్సి శ్మశాన వాటిక వద్ద నిర్మించనున్న జల్లు స్నాన ఘటానికి స్థలాన్ని ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, ఎంపిటిసి సభ్యుడు చంద్రమళ్ల పోతురాజు, వైసిపి సీనియర్ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.3.5 లక్షలతో చేపడుతున్న జల్లు స్నాన ఘట్టానికి ఎమ్ఎల్సి తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేస్తామన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి వినియోగంలోనికి తీసుకొస్తామన్నారు. వైసిపి సీనియర్ నాయకులు గంధం సూరిబాబు, ఎడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఎపి మాజీ సిఎం దామోదర సంజీవయ్య 102 వ జయంతిని మంగళవారం ఉబలంక అన్నా మినిస్ట్రీస్ కార్యాలయములో ఘనంగా నిర్వహించారు. అన్నా మినిస్ట్రీస్ స్వచ్ఛందసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఐఇ.కుమార్ తదితరులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మదర్ థెరిసా సేవాసమితి నిర్వాహకుడు, అధ్యక్షుడు దిడ్ల కిషోర్ మాట్లా డుతూ దామోదర సంజీవయ్య సేవలను కొనియాడారు. పలువురు పాల్గొన్నారు.

15 నుంచి వ్యవసాయం కార్మిక సంఘ మహాసభలు

ప్రజాశక్తి-అమలాపురం



మహాసభలకు వెలుతున్న నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం 10వ అఖిల భారత మహాసభలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హౌరాలో శరత్ సడాన్ లో ఫిబ్రవరి 15 నుంచి 18 తేదీ వరకు జరగనున్నాయని మంగళవారం నాయకులు తెలిపారు. సభల్లో గడిచిన మూడేళ్లలో సంఘం చేసిన కృషి పై సమీక్ష జరిపి వ్యవ సాయ కార్మికుల సమస్య లపై పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణ తయారు చేసుకుని నూతన కమిటీని ఏర్పాటు చేసుకుంటామన్నారు. 17న జరిగే బహిరంగ సభకు కేరళ సిఎం పి.విజ యన్ హాజరు కానున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి కారెం వెంకటేశ్వరరావు కాకినాడ జిల్లా నుంచి కెఎస్. శ్రీనివాస్, ఏలూరు జిల్లా నుంచి ఎ.రవి, రామకృష్ణ, తామ ముత్యాలమ్మ, జీవరత్నం, టి. సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లా నుంచి జె.సత్యనారాయణ, బి. జార్జి ప్రతినిధులు హాజరు కానున్నారు.

బాధితులకు 'గుడ్‌సీడ్' సాయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

కిత్తన చెరువు పంచాయతీ సీతారామపురంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలిపే లోవరాజుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. నిరాశ్రయులైన లోవరాజు కుటుంబానికి గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం నియోజకవర్గ వైసిపి నాయకుడు కుంచే రమణారావు మంగళవారం సాయం అందించారు. బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, బియ్యం, దుస్తులు, వంట సామగ్రిని గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు కుంచే అర్జున్ రావు, పరమట రాజేష్, పోలినాటి భీమేష్, ధోనిపాటి రాంబాబు, కుంచే అర్జున్ తదితరులు ఆఅందజేశారు.

విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానంలో పలు విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు హాలులో అకాడమిక్ అండ్ నాన్ అకాడమిక్ ఎంఇఒలు, ఎపిఎంలతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి పాఠశాలల్లో డ్రాప్స్ అవుట్స్, వివిధ సంక్షేమ పథకాల అమలు, మెనూ అమలు తీరు పాఠశాలలో ఉన్న వసతుల నిర్వహణ ఇత్యాది అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలు, జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు డ్రాప్ అవుట్స్ సంఖ్యను తగ్గించేందుకు ఎంఇఒలు పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో సంప్రదించి వారిని చైతన్య పరుస్తూ బడి బయట పిల్లలు లేకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు కోనసీమ జిల్లా వ్యాప్తంగా 17 కేటగిరీలలో 753 మంది బడి బయట పిల్లలు ఉన్నారని, వీరు ఏ కారణాలు చేత డ్రాప్స్ అవుట్లుగా మిగిలారని జిల్లా కలెక్టర్ ఎంఇఒ ద్వారా ఆరా తీశారు బడిబయటి పిల్లలను తిరిగి బడిలో చేర్పించాల్సిన బాధ్యతను ఎంఇఒ, హెచ్‌ఎంలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్‌వి.రవి సాగర్, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.